# "కడవంత గుమ్మడికాయ—"

"గోపి"

కథానిక

"ఎవరే ఆ మాట్లాడుతోంది?"

"మన బాబీ వచ్చాడండీ."

"ఇంకా ఏముండిపోయింది కొరవా?"

"అవేం మాటలండీ బావమరిది ఇంటికొస్తే?"

"ఉద్ధరించాడు. నీ కోసం నా కోసం రాలేదు. ఏదో పితులాటకం ఉంది."

"అసలేవాడు పుట్టెడు దుఃఖంతో ఉంటే, ఎందుకండీ ఎత్తిపొడుపు మాటలు కూడానూ!"

"మరే, మీరంతా త్యాగమూర్తులు, ఉదార స్వభావులు. నేనొక్కణ్ణే కుత్సిత స్వభావుణ్ణి. ఇప్పటికేనా మన్ని వదిలిపెడితే చాలు. విన్నావా మీ నాయన ఆ యబటారం?"

"ఒక్కమాట చెప్పండీ! మీకు నే నింట్లో ఉండటం ఇష్టంలేదా? పొమ్మనకూడదూ అంతకంటేను!"

అంత సులభంగా తెములుతుందీ వ్యవహారం? ఇప్పటికి, దగ్గరదగ్గర వెయ్యిరూపాయిలు వదిలేయి. పోయినా నోరెత్తకుండా ఊరుకుంటే, "మహారాజు మంచివాడు."

"అదెందుకు?" అంటేనే వస్తుంది అందరికీ కోపం. "పిసినాసి. డబ్బుకు మొహం వాచుకుంటాడు' అని...పోనిస్తూ చూస్తూ ఇరవై తులాల గొలుసు ఇచ్చేస్తారూ? ఎవరేనా?'

"బాగుందండీ మీరనేది" మరణ శయ్యని తండ్రి అవస్థపడుతూంటే, డబ్బే పావనం అని కూర్చోమంటారా? ఎప్పటికేనా బాబీ తీర్చేస్తాడులెండి."

పరీక్ష పేసవ్వాలి, ఉద్యోగం దొరకాలి, స్థిరపడాలి, డబ్బునిలవెయ్యాలి, వెయ్యిరూపాయిలు తీర్చాలి...బలే చెప్పావులే! అంతకంటే పాతుడు దొరకొచ్చు"

• • •

"ఏం! శ్యామం! అన్నీ సవ్యంగా జరిగిపోయాయా?"

"జరిగిపోయాయి బావా! నువ్వుండకుండా వెళ్ళిపోవచ్చావు. ఆ బ్రాహ్మణులు నా ప్రాణాలు దూసుకు తినేశారు."

"అవును! నేనుంటే ఆ తట్టంతా నా నెత్తిని పడేసి నువ్వు హాయిగా ఉండేవాడివి. అదేనా నువ్వనేది."

"కాదు బావా? నీకు కొంచం లోకానుభవం ఉంది."

"బాగాచెప్పావు! వెయ్యిరూపాయిల గొలుసూ మీ అక్కయ్య అర్పితం చేస్తూంటే, ఊరుకున్నాను అందుకే కదూ!"

"బావా! నాకో మూడు సంవత్సరాలు గడువియ్యి. నీ డబ్బు పువ్వుల్లో పెట్టి ఇచ్చేస్తాను"

"అలాగే నోయ్. అప్పుడు లోకం అంతా 'ఆహా! ఆ శ్యామలరావు చూడండీ! అపర రామావతారం. పితృవాక్య పరిపాలనా దక్షుడు. చమటూడ్చి, మూడు సంవత్సరాలు అహర్నిశం పాటుపడి తీర్చిపారేశాడు వెయ్యి రూపాయిలూను...అపర రావణుడు ఆరాజాలు (నిజంగా గుండేసి కొట్టినా పాపంలేదు) దయదాక్షిణం ఏ కోశాన్నా వెలికితేలేదు- అని అడిపోసేట్టుగ్గా ఏం!"

"నేనన్నానా? నీ డబ్బు నీకివ్వడంలో ఏముంది గొప్ప? లోకంమాత్రం ఎందుకంటుందీ?"

"అదేనోయ్! లోకం అంటే, ఈ ఆడిపోతలాడే ప్రజ. వాళ్ళు కానీ కాకపోతే ఎంత ఉదారతగా ఉండాలో చక్కా చెబుతుంది...ఎప్పుడేవిటి పరీక్షలు?"

"ఇంకేం పరీక్షలు బావా? నువ్వు దయదలిచి పంపిస్తే ఉంది లేకపోతే లేదు."

"ఓహో! అదికూడానా? కొంచం విప్పదీసి చెబితేకాని నాకర్థం కాదులే!"

"ఏముందీ! ఇంట్లో కానీలేదు. ఎం. ఎస్. సి. పరీక్షకి వంద రూపాయిలు కట్టాలి. మరోనూరు

హాస్టలుకి. తరువాత ఏదో నాలుగు ట్యూషన్లేనా సంపాదించి బ్రతకొచ్చు..." అంటే వెయ్యి రూపాయిలకీ వడ్డీ మరో రెండువందలు అంతేనా?

"రాణీ! ఓ! త్యాగమాతా! ఇలా దయ చేయండి."

"ఎందుకండీ! ఆ గావు కేకలు ఎవరేనా వింటారు."

"బాగా చెప్పావ్! ఇప్పటికే...అదంతా ఎందుక్కానీ...విన్నావా శ్యామలం ఎందు కొచ్చాడో? నీ దగ్గర ఇంకేమున్నా గొలుసులు న్నాయా? రెండొందలు కావాలిట రెండొందలు."

"అవునండీ! రెండేళ్ళా కాశీలో చదివి ఇప్పుడు తీరా పరీక్షకి వెళ్ళకుండా మానెయ్య మంటారా?"

"వెళ్ళమను, నిక్షేపంలా వెళ్ళమను. ఎవడొద్ద న్నాడు...గొలుసు లేవన్నా ఉంటే నువ్వుకూడా వెళ్లు. అబ్బాయ్ నా దగ్గిర ఒక్క కానీ కూడా పెగల్దు. ప్రజంతా నన్ను హిరణ్య కశిపునిగా అను కున్నా సరే;"

"నామాట వినండీ! బాబీ అంత అన్యాయం చెయ్యడు. వాడి పరీక్షకి కాస్త సహాయం చెయ్యండి"

"అంటే అప్పుకూడా కాదన్నమాట ఇచ్చెయ్య మంటావు...హరీ రామా!"

"బావా! ఇదిగో నాన్న రెండొందలు నా పరీక్షకోసం వేరే వేశాడుట! తలకిందే ఉంచు కున్నాడు పాస్‌బుక్! ఇది నీ దగ్గరుంచుకో నాకా రెండువందలూ సద్దు. హక్కు నీపేర వ్రాసి ఇచ్చే స్తాను...ఏం?"

"చూశావా రాణీ! మీ నాన్న దయార్ద్ర హృదయం. నిష్పాక్షిక బుద్ధి. భేష్! వెయ్యి రూపా యిలకి గొలుసు అమ్మేసి, రెండువందలు పోస్టల్‌లో వేశాడు. అలా వుండాలి తెలివితేటలు. శ్యామలం, నాయినా నాకా పాస్‌బుక్ వద్దు, నే రెండు వందలూ ఇవ్వొద్దు, మరెక్కడేనా చూచుకో!"

"ఇంత కర్కోటకం కూడదండీ! వాణ్ణిల్లా ఏడిపించి. నాకెందుకు అక్కర్లేని గొడవ. శ్యామం. మీ బావ నే బ్రతికి ఉన్నంతకాలం ఇంతే...వెళ్లు నాయనా — మీ అక్క చచ్చిపోయిందనుకో! వెళ్లు."

"అదికాదే రాణక్కా! నేనేం చేశానుచెప్పూ? నా చదువుకి అంత డబ్బౌతుందంటే మానేయమనే చెప్పి ఉందును. తీరా నెల్లాళ్ళలో పరీక్షలు. అవి కాస్తా ఐపోయాక మళ్ళా అడగను కద."

"ఆగాగు! అక్కడే పొరపాటు పడుతున్నావ్! తరువాత ఉద్యోగప్రయత్నాలు, అప్లికేషన్లు; వాటి తరువాత ఇంటర్వ్యూలు, తరువాత ఢిల్లీ వెళ్లాలి.. తీరా ఉద్యోగంకి ఆర్డరు వస్తే గుడ్డముక్కలు కుట్టించుకుందికి డబ్బు, తరువాత అక్కడ హోట లుకి డబ్బు. ఏమిలేదన్నా ఒక వెయ్యిరూపాయిలు కావాలి. ఏం?"

"శలవల్లో రిక్షాలాగన్నా నాలుగు పైసాలు కూడేస్తాను బావా!"

"బాగాచెప్పావ్! శ్యామలరావ్. ఎం. ఎస్. సి. రిక్షా సర్వీస్. పేపర్లోపడుతుంది పేరు. గొప్ప పబ్లిసిటీ! దాంట్లో వ్రాస్తారు. రాజాలు అన్న బావ డబ్బున్నవాడేకాని, శ్యామలరావు ఆత్మాభి మానం కలవాడు. అందుకని స్వయంగా రిక్షాలాగి డబ్బు సంపాదిస్తున్నాడు..."

"ఇంతెందుకు వాడికిస్తారా? ఇవ్వరా?"

"ఇంతవరకూ ఏంవిటి చెబుతున్నట్టు?"

"శ్యామలం! నే చెప్పాను కదరా! ఎందు కిక్కడ ఆలశ్యం?"

"ఇంకెవరున్నారు రాణక్కా? పాస్‌బుక్‌లో డబ్బు అధమం ఆర్నెల్లు పడుతుంది వచ్చేసరికి. కానీ డబ్బు లేదు ఇప్పుడు కాలేజీ పోవడానికి. ఇంట్లో చెంబూగిన్నే అమ్మినా అరణాలు రావు. చదువు పూర్తయితేకాని ఉద్యోగం రాదు. ఊళ్ళో ఎవర్నడిగినా 'నీకేమయ్యా ఇక్కడా అక్కడా ముష్టి? రాజాలు కుబేరుడిలా ఒక బావమరిది ఉండగా' అంటారు ఏంచెయ్యను రాణక్కా?"

"ఏమండోయ్!"

"ఏం? ఆఖరు మాటడుగుతున్నా! ఏం? రెండు వందలూ ఆపాస్‌బుక్ ఉంచుకొని ఇస్తారా ఇవ్వరా?"

"ఇవ్వను."

"బిస్తరు కట్టురా శ్యామలం. నేనూ కాశీ చూడాలని చాలాకాలం బట్టీ అనుకుంటునా!"

"ఏంవండోయ్! వంటింట్లో అన్నం వండిపెట్టి ఉంచా. మీకు రాత్రికూడా సరిపోతుంది. జాగ్రత్తగా ఎత్తి పెట్టుకోండి!"

"ఎక్కడికేవిటి ప్రయాణం?"

"కాశీకి"

బాగుంది ఏవిటంత ములక?

"చాలా కాలంనుంచీ కాశీ చూడాలని ఉంది. కానీ ఏ నాటికి ఎవరికి ప్రాప్తమో!"

"ఇదిగో వెళ్ళినదానివి మళ్ళా రావడానికి మాత్రం తాపత్రయ పడకు."

"అయ్యోరామా! విశాలమైన గంగాను తల్లి కాళ్ళు దాచుకో పిలుస్తూంటే మీ దగ్గర కెందుకు"

"ఛీ! ఛీ!! బడిదేరిన మనుషులు. శ్రీ రాజాలు గారిభార్య కాశీవెళ్ళి గంగానదిలోపడి 'ఆత్మహత్య' చేసుకుందని పేపర్లో పడాలనా?"

"పోనిస్తూరు! మీతో ఎందుకీవాదన"

"నా మాటవిను. ఇప్పుడు వందిస్తాను. తరువాత మిగతావందా ఫంపిస్తాను."

"సరే! బావా"

"ఆగు శ్యామం. అలా పనికిరాదు. రెండొందలూ ఇప్పుడే ఇవ్వాలి. తరువాత నన్ను తిప్పలు పెడతారు."

"ఇస్తాన్లేవోయ్! ఆపేస్ బుక్కలా ఇవ్వవోయ్ శ్యామం."

"అయ్యోరామా! ఆరెండొందలూ లాక్కుంటే వాడి ఇంటర్వ్యూలకీ, అప్లికేషన్లకీ మళ్ళా ఎక్కడ పరిగెడతాడు. ఇంతకీ అది వచ్చేసరికి వాడికెన్నో చికాకులు కూడా ఉన్నాయి."

"నువ్వనేదేవిటి! ఆ పాస్‌బుక్‌లో డబ్బు ఇవ్వడంటావ్."

"శ్యామం ఉద్యోగం కాగానే, తీర్చేస్తాడు అందుకు హామీ నేను."

"సరే! ఇదుగోనోయ్ డబ్బు."

"శ్యామం ఇబ్బందిపడకు. నీ పరీక్షలైనాక నేనూ బావాకూడా వస్తాం మీవూరు, మీకాలేజీ అవి చూపిస్తావుకదూ!"

* * *

"వెళ్ళొస్తా బావా! వెళ్ళొస్తా రాణక్కయ్యా!"

"వెళ్ళిరా! తరుచూ ఉత్తరాలు వ్రాయి."

"నువ్వు చేసిన మేలు ఎప్పుడూ మరిచిపోను బావా!"

'ఆదోటి! మీదుమిక్కిలి. ఈ చదువు తరువాత ఇంకోటేదన్నా ఉందా?'

"లేకేం బావా? డి.యస్‌సీ. ఉంది...చాలా మంది ఇంగ్లాండుకూడా వెడతారు. వెళ్ళొస్తా రాణక్కయ్యా!"

"పాపం ఈ నెల్లాళ్ళూ సతమతమై ఎల్లా చిక్కిపోయాడో వెఱ్ఱినాగమ్మ ఏవండీ! మీరీ డబ్బంతా ఏం చేస్తారండీ!"

"మీ నాన్న దగ్గర ఉన్నడబ్బేం చేశాడు చెప్పూ? చచ్చిపోయేసరికి ఏవుందీ?"

"పోనిస్తురూ ఎవరిఖర్మ ఎలాగుందో! నాన్నేం చెడుపనులు చెయ్యలేదు. జాలి గుండె. ఎంతమంది చదువుకుంటామంటే సాయం చెయ్యలేదు. అయ్యగారికి బి. ఏ. ఎవరు సాయం చేశారో?"

"అవును...లే! మీ నాన్నే చేశారనుకో!"

"మరి ఉద్యోగానికి ప్రయత్నాలు."

"నిన్ను చూచి చేశారు. నా కోసానికేం కాదు."

"ఇప్పుడు నన్ను చూచే మీరూ శ్యామానికి సహాయం చెయ్యాలి."

"చేశానుగా దేవీ? ఇప్పుడు..."

"అంటారు కానీ! మీకు మాత్రం శ్యామం అంటే లేదూ!"

"అదోటి పైపెచ్చు!"

"నామాటేముంది లెండి. రేపు శ్యామం పెండ్లికి ఎవరు అడగవచ్చినా 'రాజాలు'గార్ని అడిగే ఇస్తారు!"

"అది భేషైనమాట: పదివేల రూపాయిలుతో పిల్లనిస్తామని వస్తారు. నాకే శ్యామం అధికారం ఇస్తే-ఈ రోజున ఏ కిరస్తానీ పిల్లనో ప్రేమించే నని చెప్పి పెళ్ళి చేసుకోకపోతే!"

"ఛీ! మీరెప్పుడూ అంతే! మీరు కాకపోతే నేను కాకపోతే శ్యామానికి తల్లా, తండ్రా? పెద్ద చదువులకి వస్తే మేనల్లుళ్లందరూ వాడి మెడ పట్టుకోరూ? హాయిగా కూర్చుంటారు బ్యాంకులో డబ్బువేసుకున్నట్లు రాజావారు—"

"చాల్లే! నీ గాలికబుర్లు. ఆకలౌతూంది పద!"